
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



భద్రాద్రి కొత్తగూడెం

ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 33 । కనిష్ఠం 22 | భద్రాద్రి: గరిష్ఠం 35 । కనిష్ఠం 25 ఆదివారం, 11 ఫిబ్రవరి 2024




- రాష్ట్ర తాత్కాలిక బడ్జెట్‌లో 'ఆరు గ్యారెంటీ'లకే ప్రాధాన్యం
- సాగునీటి రంగంలో 'సీతారామ'కు నిధులు
- రుణమాఫీ కింద 5 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- రైతుభరోసా కింద ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం
- తొలిసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిబడ్జెట్‌లో ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రవేపెట్టిన ఈ ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం కొత్తగా ఎలాంటి హామీలు ఇవ్వలేదు. ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థికమంత్రిగా తొలిసారి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ను ప్రజలకు భరోసా కల్పించేలా రూపొందించారు.

బతుకు భరోసా

ఖమ్మం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంతకుముందే ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు తప్ప, కొత్తగా బడ్జెట్‌లో ఎలాంటి వరాలూ ప్రకటించలేదు. ప్రజాపాలన గ్రామసభల ద్వారా ఇప్పటికే ఈ ఆరు గ్యారెంటీలకు ప్రజలు దరఖాస్తులు చేసుకోగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.500 గ్యాస్‌సిలిండర్, మహాలక్ష్మి పథకానికి 3,20,605 మంది దరఖాస్తు చేసుకున్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ కల్పించేందుకు ప్రస్తుతం వివరాల సేకరణ కొనసాగుతోంది.



సీతారామ ప్రాజెక్టుకు ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు రూ.28,024 కోట్లు కేటాయించింది. జిల్లాలో సీతారామ ఎత్తిపోతలు, పథకాలకే సుమారు రూ.10వేల కోట్ల నిధులు అవసరం ఉండగా, పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయింపుల అనంతరం సీతారామ ప్రాజెక్టుకు, సీతమ్మసాగర్‌కు రూ.2వేల కోట్ల నిధులు ఈ తాత్కాలిక బడ్జెట్‌లో కేటాయించే అవకాశం ఉంది. ప్రస్తుతం తక్షణ పనులకు మాత్రమే నిధుల కేటాయింపు ఉన్నట్టు తెలిసింది. తాలిపేరు, కిన్నెరసాని, పాలేరు, వైరా, లంకసాగర్, బేతుపల్లి ప్రాజెక్టుల మరమ్మతులకు సైతం నీటిపారుదలశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పనులకు సుమారు వెయ్యికోట్ల వరకు అవసరం ఉంది. పూర్తిస్థాయి కేటాయింపులతో నీటిపారుదల అభివృద్ధి పనుల లెక్కతేలనుంది.

అన్నదాతలకు భరోసా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో వ్యవసాయానికి కూడా అధిక ప్రాధాన్యత కల్పించారు. ఈ శాఖకు మొత్తం రూ.19,746 కోట్ల నిధులు కేటాయించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లానుంచే ప్రాతినిధ్యం వహిస్తుండడంతో కేటాయింపుల్లో జిల్లాకు ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది. రైతులకు త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని బడ్జెట్‌లో హామీ ఇచ్చారు. రుణమాఫీ జరిగితే ఉమ్మడి జిల్లాలో సుమారు 5 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకు రూ.1,700 కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయి.

అలాగే రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు సాగు సాయం చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వం సాగుతో సంబంధం లేకుండా పాసుబుక్కులో ఉన్న భూములన్నింటికీ ఎకరానికి రూ.10 వేలు సాగు సాయంగా ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగు సాయాన్ని రూ.15 వేలకు పెంచి సాగులో ఉన్న భూమికి మాత్రమే ఇస్తామని తెలిపింది. బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.40,080 కోట్లు కేటాయించారు. దాంతో ఉమ్మడి జిల్లాలో గ్రామీణ రహదారులు, కల్వర్టులకు నిధులు దక్కే అవకాశం ఉంది. పంచాయతీరాజ్‌ఖ నుంచి ఉమ్మడి జిల్లాలో వెయ్యి కోట్లతో రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఇక బడ్జెట్‌లో గృహనిర్మాణ శాఖకు రూ.7540 కోట్లు కేటాయించడంతో పాటు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. తద్వారా ఉమ్మడి జిల్లాకు 35 వేల ఇళ్లు దక్కనున్నాయి. బడ్జెట్‌లో వైద్య, విద్యారంగానికి ప్రభుత్వం నిధులు కేటాయించినా జిల్లాల వారీగా కేటాయింపులు లేకపోవడంతో దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఖమ్మంలో మెడికల్ కళాశాల అభివృద్ధికి సుమారు రూ.100 కోట్ల అవసరం ఉంది. కొత్తగూడెం మెడికల్ కాలేజీ భవనాలకు నిధులు కేటాయించాల్సి ఉంది. మద్దులపల్లిలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీకి స్థలం, నిధులు కేటాయించాల్సి ఉంది.



డ్రైపోర్టు ఎక్కడ?

తెలంగాణకు సముద్రం లేనందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో డ్రైపోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నలుదిక్కులా నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులు కాకినాడ, విశాఖపట్నం పోర్టులకు అనుసంధానం కాబోతున్నందున జిల్లాలోనే డ్రైపోర్టు పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఖమ్మం జిల్లాలోనే డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా అది సాధ్యం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం డ్రైపోర్టులకు ప్రాధాన్యత ఇస్తే ఖమ్మం జిల్లాలోనే పోర్టు పెట్టే అవకాశం ఉంది.

అంకెల గారడీ చేశారు..



నామా నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. భట్టి పద్దు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదు. వ్యవసాయరంగానికి రూ.7,085కోట్లు కోత విధించటంతో రైతులు సంక్షోభంలో చిక్కుకుంటారు. కౌలు రైతులకు సాగుసాయంపై బడ్జెట్‌లో ఊసే లేదు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల సాయం, వరికి రూ.500బోనస్‌పై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవటం దారుణం.

రైతులకు తీవ్ర అన్యాయం



తాతా మధు, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

ఆర్థిక మంత్రి భట్టి శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. అంకెలు మార్చి ఆంక్షలతో వ్యవసాయరంగాన్ని తీవ్ర సంక్షోభంలో నెడుతున్నారు. రైతలకోసం వరంగల్‌లో కాంగ్రెస్ ఇచ్చిన రైతు డిక్లరేషన్ చిత్తుకాగితమేనని బడ్జెట్ ద్వారా రుజువైంది. 50శాతానికి పైగా ఉన్న బీసీల సంక్షేమానికి కేవలం రూ.8వేల కోట్లే కేటాయించి తీవ్ర అన్యాయం చేశారు.


సాదా సీదాగా ఉంది..



పోటు రంగారావు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్ సాదాసీదాగా ఉంది. కాంగ్రెస్ తనదైన పాత మూస ఫార్ములాతో బడ్జెట్‌ను రూపొందించారు. విద్యా, వైద్యానికి కావాల్సిన నిధులు కేటాయించలేదు. నీటి పారుదల శాఖకు సరైన నిధులు లేవు. ఉద్యోగాల భర్తీపై స్పష్టతలేదు. ఆరు గ్యారెంటీలకు కేటాయించిన నిధులు కూడా సరిపోవు. ఉపా వంటి నల్ల చట్టాల రద్దుపై ఎటువంటి ప్రకటన చేయలేదు.

ఇందిరమ్మ రాజ్యం దిశగా అడుగులు



పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్‌తో ఇందిరమ్మ రాజ్యం దిశగా అడుగులు పడ్డాయి. వైద్యా, వైద్య రంగాలకు గత ప్రభుత్వాల కంటే అధికంగా నిధులు కేటాయించారు. గిరిజన, దళిత, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలకు కావాల్సిన మేరకు నిధులు కేటాయించారు. వ్యవసాయ రంగానికి అధికంగా నిధులు కేటాయించారు. 100రోజుల్లోనే ఆరుగ్యారెంటీలను అమలు చేసే దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి.

కేటాయింపుల మేరకు నిధులివ్వాలి



బాగం హేమంతరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కేటాయింపులు బాగున్నాయి. కానీ ఆ మేరకు నిధులు కేటాయించి అమలు చేయాలి. ఆరు గ్యారెంటీ పథకాలకు రూ.63,196 కోట్లు కేటాయించడాన్ని సీపీఐ ఆహ్వానిస్తోంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ఈ బడ్జెట్ దగ్గరగా రూపొందించారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం అభినందనీయం.

కౌలు రైతులకు ప్రోత్సాహకాలు భేష్



పోతినేని సుదర్శన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. సాగులోలేని భూములు, రియల్ ఎస్టేట్ భూములకు రైతుబంధు ఇవ్వబోమని ప్రకటించడం హర్షణీయం. కౌలు రైతులకు ప్రోత్సహకాలను ప్రకటించటం వ్యవసాయ రంగానికి మంచి పరిణామం. ఆరు గ్యారెంటీలకు సరిపడ నిధులు కేటాయించారు. గురుకుల విద్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మాణం చేయాలి. విద్యారంగంలో విద్యార్థుల భోజనాలను నిధులు పెంచాల్సి ఉంది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ట్రోలింగ్ విష సంస్కృతిని

తిప్పికొడతాం

- ఘనంగా ప్రారంభమైన ప్రరవే 7వ రాష్ట్ర మహాసభలు
- తరలివచ్చిన అభ్యుదయ మహిళలు
- 'ట్రోల్' పుస్తక ఆవిష్కరణ

7

అప్పుడే దడ పుట్టిస్తున్న ఎండలు



- ఇప్పటికే అత్యధికంగా 38.5 డిగ్రీలు నమోదు
- గతేడాది కంటే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఏప్రిల్‌లో 50 డిగ్రీల వరకు చేరే అవకాశం
- ప్రతీయేటా రాష్ట్రంలో ఖమ్మం, భద్రాద్రినే ప్రథమం

ఖమ్మం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. గత వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఈ యేడాది కూడా ఎండలు మండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి ప్రారంభం నుంచే ఎండలు పెరిగిపోవడంతోపాటు రాత్రివేళల్లో కూడా ఆయా ఉష్ణోగ్రతలు తగ్గని పరిస్థితి నెలకొంది.

ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు రాష్ట్రంలోనే అత్యధికంగా ఉంటున్నాయి. అంతేకాదు గతంతో పోలిస్తే ప్రతీయేటా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మూడు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. గతేడాది ఫిబ్రవరి ప్రారంభ సమయంలో 2022లో నమోదైన ఉష్ణోగ్రతల కంటే నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2022 ఫిబ్రవరి నెలాఖరులో 32-33 డిగ్రీలు మాత్రమే నమోదవగా అది 2023 కు చేరేసరికి 37 నుంచి 39కు చేరింది.

ఈ యేడాది ఫిబ్రవరి ప్రారంభం అయిన వారం రోజులకే 39వరకు ఉష్ణోగ్రతలు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఖమ్మం 38.5, భద్రాద్రి కొత్తగూడెంలో 37.1 డిగ్రీలు అత్యధికంగా ఉన్నాయి. అయితే ఎప్పుడూ ఫిబ్రవరి చివరి వారంలో పెరగాల్సిన ఎండలు మొదటి వారంలోనే మండిపోతుడటంతో రానున్న రోజుల్లో ఉమ్మడి ఖమ్మంలో ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయోనన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉంటే రాత్రి వేళల్లోనూ ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గని పరిస్థితి నెలకొంది. శుక్రవారం రాత్రి నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఖమ్మంలో 21.5, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21.2 నమోదవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో పవర్‌ప్లాంట్లు, బొగ్గు గనులు ఉన్న నేపథ్యంలో ప్రతీయేటా రాష్ట్రంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు మొదటిస్థానంలో ఉంటున్నాయి. మార్చి నెలాఖరు నుంచే 45 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండేవి. కాగా ఈ యేడాది గతానికి భిన్నంగా మరో మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతోండటంతో ఏప్రిల్‌లో 50కు చేరే అవకాశం లేకపోదంటూ పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు.

తహసీల్దార్లకు స్థానచలనం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్టీ జోన్-1 పరిధిలో 69మంది తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసింది.ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు తహసీల్దార్లకు స్థానచలనం జరిగింది. ఎం. శైలజను మహబూబాబాద్‌కు, ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పనిచేస్తున్న ఎస్.శ్వేతను మహబూబాబాద్‌కు, కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న కారుమంచి శ్రీనివాసరావును భద్రాద్రి జిల్లాకు బదిలీ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న టి.గౌరీశంకర్‌ను ఖమ్మానికి బదిలీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలనుంచి ఎనిమిది మంది తహసీల్దార్‌లను భద్రాద్రి జిల్లాకు కేటాయించారు.



గ్రూప్ 4 టాపర్ అభిలాష్

- ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు కైవసం
- ప్రస్తుతం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం

7

సంక్షోభంలో విద్యారంగం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర నాయకులు

- ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలు
- కొత్త ప్రభుత్వం చొరవ తీసుకోవాలి
- సాయంత్రం నగరంలో భారీ ప్రదర్శన, బహిరంగసభ
- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్

నేడు, రేపు ఖమ్మంలో విద్యా వైజ్ఞానిక మహాసభలు

7

నిఘా కళ్లు గప్పి..

- ఒడిషా నుంచి భద్రాచలం మీదుగా గంజాయి రవాణా
- పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఆగని దందా
- వరుస ఘటనలతో నిఘా తీవ్రం చేసిన భద్రాద్రి పోలీసులు

7



- 2026 ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలన్నదే లక్ష్యం
- త్వరలో నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల ప్రారంభం
- సుదూర ప్రాంతాలకు తగ్గనున్న ప్రయాణ సమయం
- ఉమ్మడి జిల్లా రవాణా రంగానికి మహర్దశ
- ఎన్‌హెచ్ అథారిటీస్ ఖమ్మం పీడీ దుర్గాప్రసాద్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రూ.8వేల కోట్లతో జాతీయ రహదారులు

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయని నేషనల్ హైవే అథారిటీస్ ఖమ్మం ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్ వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనులపురోగతిని వివరించారు. హైవేల కోసం రాష్ట్రంలో అత్యధిక నిధులు జిల్లాలోనే వెచ్చిస్తున్నారని తెలిపారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే ప్రయాణ సమయం తగ్గుతుందన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన పలు వివరాలను వెల్లడించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

ప్రశ్న: జిల్లాలో జాతీయ రహదారులు ఎక్కడెక్కడ సాగుతున్నాయి?

జవాబు: సూర్యాపేట-ఖమ్మం రహదారి పని పూర్తయింది. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే విజయవాడ-నాగపూర్ జాతీయ రహదారి పనులు త్వరలోనే ప్రారంభించబోతున్నాం.

ప్ర: మొత్తం ఎన్నికోట్ల నిధులు ఖర్చుచేస్తున్నారు ?

జ: ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారుల పనులు 2026 ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలన్నదే లక్ష్యం. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో కంటే ఖమ్మం జిల్లాలోనే జాతీయ రహదారుల నిర్మాణాలకు నిధులు ఎక్కువగా మంజూరయ్యాయి. సుమారు రూ.8వేల కోట్లు కేటాయించారు. సుమారు 269 కి.మీ. మేర నాలుగులైన్ల రహదారులు, బ్రిడ్జిలను నిర్మించబోతున్నాం. ఇప్పటికే కొన్నిచోట్ల రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ప్ర: జాతీయ రహదారుల నిర్మాణంతో ప్రయోజనాలు ఎలా ఉంటాయి?

జ: జాతీయ రహదారుల నిర్మాణంతో సుదూర ప్రయాణాల్లో వేగం పెరగడంతో పాటు విలువైన సమయం కలిసి వస్తుంది. ఈ రహదారులు విశాఖపట్నం,కాకినాడ పోర్టులు అనుసంధానం కాబోతున్నాయి. దీంతోపాటు ఖమ్మం-నాగపూర్, ఖమ్మం-దేవరపల్లి మధ్య దూరం తగ్గుతుంది. ప్రయాణ సమయం కొన్ని గంటల మేర తగ్గుతుంది. అలాగే సరుకు రవాణా వేగంగా సాగుతుంది.

ప్ర: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి పరిస్థితి ఏంటి ?

జ: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి పనులన్నీ పూర్తయ్యాయి. రూ.1,876కోట్లతో ఈ రహదారి పనులు పూర్తి చేశాం. దీన్ని ఇప్పటికే ప్రధాన మంత్రి ప్రారంభించారు. 58.6కి.మీ ఉన్న ఈ రహదారిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ప్ర: ఖమ్మం-నాగపూర్ జాతీయ రహదారి పనులెప్పుడు ప్రారంభం కానున్నాయి?

జ: ఖమ్మం-నాగపూర్ జాతీయ రహదారి పనులు ఇతర ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లాలో త్వరలోనే ప్రారంభించబోతున్నాం. జిల్లాలో సుమారు 77కి.మీ. పొడవున రూ.2,800కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్నాం. ఈ రహదారి పూర్తయితే నాగపూర్‌నుంచి విజయవాడకు ప్రయాణ సమయం తగ్గుతుంది. ప్రస్తుతం 660కి.మీ. ఉన్న నాగపూర్-విజయవాడ ప్రయాణ దూరం 420కి.మీ.లకు తగ్గుతుంది. ఇది పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్‌హైవేగా నిర్మిస్తున్నాం. నాలుగు గంటల్లోనే నాగపూర్‌నుంచి విజయవాడ చేరుకోవచ్చు. దీనికి సంబంధించి 375ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికే 250 ఎకరాల సేకరణ పూర్తయ్యింది. మిగిలిన భూసేకరణ త్వరలో పూర్తి చేస్తాం. ఈ రహదారిని 2026నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

ప్ర: ఖమ్మం-దేవరపల్లి ఎంతవరకు వచ్చాయి ?

జ: ఖమ్మం-దేవరపల్లి కూడా గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా నిర్మిస్తున్నాం. 103కి.మీటర్ల మేర రూ.2,300కోట్లతో

(మిగతా 7వ పేజీలో)



ప్రభుత్వ ఆస్పత్రిలో నిరుపయోగంగా క్యాథ్‌ల్యాబ్

- రెగ్యులర్ వైద్యుడు లేక ఇబ్బంది
- ప్రస్తుత నిపుణుడి డిప్యూటేషన్ రద్దు
- గుండె జబ్బుల బాధితుల్లో ఆందోళన

హృదయం విలవిల

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిలిచిన క్యాథ్‌లాబ్ సేవలు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ఖమ్మం జిల్లా పెద్దాసుపత్రిలో కీలక మైన హృద్రోగ విభాగానికి వైద్యులు లేకపోవడంతో మూడు రోజులుగా సేవలు నిలిచిపోయాయి. ఖరీదైన యంత్రాలను సమకూర్చిన సర్కారు దానికి అవసరమైన సిబ్బందిని, వైద్యులను సమకూర్చడంపై దృష్టిసారించ లేదు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు పూర్తిగా నిలిచాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో గుండె సంబంధిత పరీక్షలు, వైద్యం కోసం క్యాథ్‌ల్యాబ్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటుచేశారు. రూ.7కోట్లతో ఉస్మానియా ఆస్పత్రిలో అందించే సేవలను ఖమ్మంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి వరకు ఉన్న ఈసీజీ, టూడీ ఎకో, యాంజియోగ్రామ్ మాత్రమే ఉండేవి. క్యాథ్‌ల్యాబ్‌తో గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారికి ఎంజియోప్లాస్టీ, పేస్‌మేకర్లు, గుండెకు సంబంధించిన లోపాలను తెలుసుకునే వీలు కలిగింది. ఈ పరీక్షల ద్వారా గుర్తించిన రోగుల గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాలు పాడైతే స్టెంట్లు వేస్తున్నారు. అంతటి కీలక విభాగంలో వైద్యుణ్ని నియమించడంలో ప్రభుత్వం విఫలమైంది.

గుండె వైద్యుడి నియామకంపై నిర్లక్ష్యం

ఇప్పటి వరకు వైద్యవిధానపరిషత్ పరిధిలో కొనసాగిన ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో గుండె సంబంధిత వైద్యుడిని నియమించారు. డాక్టర్ సీతారాం క్యాథ్‌లాబ్ నిర్వహణలో మంచి పేరు తీసుకొచ్చారు. కానీ జిల్లా దవాఖాన డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో సీతారాంను బదిలీ చేశారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక శ్రద్ధతో ఆయనను డిప్యూటేషన్‌పై ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటి నుంచీ సేవలు అందుతూనే ఉన్నాయి. కానీ మూడు రోజుల క్రితం ప్రభుత్వం డిప్యూటేషన్‌ను రద్దు చేశారు. సీతారాం తనకు కేటాయించిన మంచిర్యాల మెడికల్ కళాశాలకు వెళ్లిపోయారు. వైద్యుడు లేకపోవడంతో క్యాథ్‌లాబ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రస్తుతం వార్డులో ఉన్న రోగులు, స్టెంట్లు వేయాల్సిన బాధితుల వారి కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజనసంక్షేమ శాఖ ఆర్ట్ స్కూల్

ఆరంభ శూరత్వమేనా?

- పద్మశ్రీ గ్రహీత రామచంద్రయ్యకు దక్కని గౌరవం
- అందని గౌరవ వేతనం, కోటి రూపాయల నజరాన

భద్రాచలం, ఫిబ్రవరి 10: అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు భద్రాచలంలో ఏర్పాటు చేసిన గిరిజన సంప్రదాయ నృత్య పాఠశాల బాలారిష్టాలను దాటడంలేదు. ఏ లక్ష్యంతో ఆ పాఠశాలను ఏర్పాటు చేశారో దానికి ఆమడ దూరంలో ఆ పాఠశాల ప్రారంభానికి నోచుకోని పరిస్థితిలో ఉండటం గమనార్హం. డోలి వాయిద్య జానపద కళాకారుడు సకిని రామచంద్రయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన క్రమంలో రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో మూడు చోట్ల గిరిజన సంప్రదాయ నృత్య పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా భ ద్రాచలం ఐటీడీఏ కేంద్రంగా ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు గిరిజన సంప్రదాయ నృత్య పాఠశాల ఏర్పాటు చేశారు.



రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న రామచంద్రయ్య(ఫైల్)

2022 మార్చి 29న రామచంద్రయ్యను చీఫ్ మాస్టర్‌గా నియమిస్తూ అప్పటి ఐటీడీఏ పీవో గౌతమ్ పోట్రు ఉత్తర్వులు జారీ చేశారు. 2022 జూన్ నుంచి 2023 మార్చి వరకు నెలకు రూ.20 వేల చొప్పున గౌరవ వేతనంగా అందించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే అప్పటి ప్రభుత్వం గత రెండేళ్లుగా బడ్జెట్ మంజూరు చేయకపోవడంతో చీఫ్ మాస్టర్ రామచంద్రయ్య పదవీ కాల పరిమితి ముగిసి ఏడాది గడుస్తున్నా.. నేటికి ఆయనకు 10 నెలలకు చెల్లించాల్సిన గౌరవ వేతనం చెల్లించకపోవటం గమనార్హం. అంతే కాదు ప్రభుత్వం నుంచి ఎటువంటి బడ్జెట్ విడుదల కాకపోవటంతో పాఠశాల సైతం ప్రారంభం కానిపరిస్థితి ఉంది

స్థలమిచ్చారు.. రూ.కోటి ఇచ్చేదెన్నడు?

సకిని రామచంద్రయ్య 2022లో పద్మశ్రీ అవార్డు స్వీకరించిన అనంతరం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పద్మ అవార్డు గ్రహీతలకు నివాస యోగ్యమైన స్థలంతో పాటు రూ.కోటిని మంజూరు చేయాలనుకుంది. దీంతో అధికారులు 2023 మే 29న ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో కొత్తగూడెంలో సర్వే నెం.143లో 462 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే రూ.కోటి ఇంత వరకు వారికి అందలేదు.

శిశుగృహలో చిన్నారికి ఆశ్రయం

ఖమ్మం ఖానాపురంహవేలీ, ఫిబ్రవరి 10: జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మంలోని శిశుగృహలో నెలల పాపను సంరక్షణలో ఉంచినట్లు జిల్లా సంక్షేమ అధికారి సుమ శనివారం తెలిపారు. ఈ పాపకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుంచి 30 రోజులలోగా తగిన సాక్ష్యాధారాలతో నూతన కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారిని సంప్రదించాలని తెలిపారు. లేనిపక్షంలో ఈ పాపని అనాధగా ప్రకటించి, ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం దత్తతకు ఇస్తామని తెలిపారు. దత్తత పట్ల ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సంక్షేమ అధికారి తెలిపారు.

సిటీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ హరికృష్ణ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 10: ఖమ్మం పాత బస్‌స్టేషన్‌లో సీసీ కెమెరా వ్యవస్థను ఖమ్మం ఏసీపీ హరికృష్ణ, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఉదయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఖమ్మం బస్టాండ్, పరిసరాలు పూర్తిగా సీసీ కెమెరా నిఘాలో ఉంటాయని తెలిపారు. ప్రయాణికుల భద్రతలో భాగంగా కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి. శ్రీనివాసరావు, బస్‌స్టేషన్ మేనేజర్ రాయప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డాక్టర్స్ క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 10: సైజర్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నాలుగు జిల్లాల స్థాయి డాక్టర్స్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చిన్న పిల్ల డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. టోర్నీలో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాల నుంచి ప్రముఖ డాక్టర్లు పాల్గొంటారని తెలిపారు.

15, 16 తేదీల్లో జాతీయ సదస్సు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 15, 16వ తేదీల్లో అప్లికేషన్స్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

అడుగులన్నీ అయోధ్య వైపే..

- ప్రత్యేక రైలులో రామ్ లల్లా దర్శనానికి భక్తులు

కొణిజర్ల/ చింతకాని/ ఖమ్మం బైపాస్ రోడ్, ఫిబ్రవరి10: శ్రీ రామదర్శన్ అభియాన్‌లో భాగంగా ఖమ్మం నుంచి అయోధ్యకు ఏర్పాటు చేసిన చేసిన రైలుబండిలో కొణిజర్ల మండలం నుంచి 350 మంది రామభక్తులు బయలుదేరారు. కొణిజర్ల, తనికెళ్ల, అమ్మపాలెం తదితర గ్రామాల నుంచి రామనామస్మరణ చేసూకుంటూ భజనలు చేస్తూ ఖమ్మానికి రైలు ఎక్కేందుకు వెళ్లారు. అయోధ్యకు వెళ్లిన భక్తులు ఈనెల 14న తిరిగి ఖమ్మం చేరుకోనున్నారు. అయోధ్యకు వెళ్లడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని భక్తులు, బీజేపీ మండల అధ్యక్షుడు తుప్పతి మల్లికార్జున్, జిల్లా నాయకుడు బండారు నరేష్ తెలిపారు. చింతకాని మండలం నేరడ నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు ఆలస్యం వీరప్రసాద్‌తో పాటు గ్రామానికి చెందిన మరికొంత మంది యువకులు శనివారం ప్రత్యేక రైల్‌లో అయోధ్య శ్రీరాముని దర్శనానికి వెళ్లారు. ఖమ్మం నుంచి అయోధ్యకు వెళ్లే ఆస్తా ఎక్స్‌ప్రెస్ రైలుకు బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.



కొణిజర్ల నుంచి అయోధ్యకు బయలుదేరిన భక్తులు

రాష్ట్ర స్థాయి పోటీలకు 10 ప్రాజెక్టుల ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలీ, ఫిబ్రవరి 10: జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో పది ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ శనివారం తెలిపారు. ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు ఆన్‌లైన్లో నిర్వహించగా 101 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారని తెలిపారు. వాటిలో 10 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

రెజోనెన్స్ పాఠశాల ఖమ్మం, సింగరేణి పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ గోళ్లపాడు, కేజీబీవీ సింగరేణి, జడ్పీహెచ్‌ఎస్ కొణిజర్ల, శాంతినగర్ పాఠశాల ఖమ్మం, జడ్పీహెచ్‌ఎస్ గుదిమళ్ల, టేకులపల్లి పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ అయ్యగారిపేట, జడ్పీహెచ్‌ఎస్ చెన్నూరు పాఠశాలల విద్యార్థుల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

విద్యార్థులకు సైన్స్ డే పోటీలు

రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో శనివారం నేషనల్ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో సోమశేఖర శర్మ హాజరై మాట్లాడారు. విజేతలకు 28న హైద్రాబాద్ రవీంద్రభారతలో జరిగే కార్యక్రమంలో బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అదికారి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి టైలరింగ్, డ్రాయింగ్ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలీ, ఫిబ్రవరి 10: టైలరింగ్, డ్రాయింగ్, ఎంబ్రాయిడరి లోయర్, హైయ్యర్ పరీక్షలను ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవ సోమశేఖర శర్మ శనివారం తెలిపారు. హాల్ టికెట్లు పరీక్ష వారం ముందుగా కార్యాలయ వెబ్ సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణతులసార్చన

- స్వామివారికి ఆభరణాలు అందజేసిన భక్తులు

భద్రాచలం, ఫిబ్రవరి 10: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సందర్భంగా అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పెండ్యాల వెంకటరమణ స్వామి వారికి రూ. 2.30లక్షల విలువైన మిశ్రమ బంగారుచైన్, బంగారు సూత్రాలను, వెండి జంధ్యాలను అందించారు. దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి హన్మకొండ ప్రగతినగర్‌కు చెందిన వాకా సత్యనారాయణ, జయలలిత రూ.1,01,116లు విరాళంగా అందజేశారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 10: కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావుకు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో గత సూపరింటెండెంట్ డాక్టర్ బోడా కుమారస్వామిపై భద్రాద్రి కలెక్టర్ ప్రియాంకకు ఫిర్యాదులు అందడంతో ఇటీవలే ఆయన్ను డీఎమ్‌ఈకి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. దాంతో ఆయన స్థానంలో కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌కు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 10: సుమారు 30ఏళ్ల వయసున్న గుర్తుతెలియని యువకుడి మృతదేహం శనివారం ఖమ్మం నగరంలో లభ్యమైంది. నగరంలోని ఓల్డ్ క్లబ్ రోడ్డు సమీపంలో ఓ కళాశాల గల్లీలో ఓ యువకుడి మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో పోలీసులు ఫింగర్‌ప్రింట్ తీసుకుని విచారణ చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడి మృతి

కొత్తగూడెం పోస్టాఫీసు,, ఫిబ్రవరి 10: ఖమ్మం నుంచి కొత్తగూడేనికి స్కూటీపై వచ్చిన యువకుడు చల్లా దుర్గాప్రసాద్(18) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. కొత్తగూడెం మీదుగా రాంపురానికి స్కూటీపై వస్తున్న క్రమంలో సింగరేణి హెడ్ ఆఫీసు వద్ద డివైడర్‌ను ఢీకొని మృతిచెందాడు. పోలీసులు మృతుడి తల్లి, బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని వారికి అప్పగించగా నివాసప్రాంతమైన ఖమ్మానికి తరలించారు. దుర్గాప్రసాద్ ఐటీఐ పూర్తి చేసి తల్లితో కలిసి ఖమ్మంలో ఉంటున్నారు. తల్లి చల్లా ఉమ ఖమ్మం మునిసిపాలిటీలో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లి రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు'

ఇంటర్నేషనల్ స్కూల్‌కు స్థల పరిశీలన

చింతకాని, ఫిబ్రవరి 10: చింతకాని మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని ఖమ్మం ఆర్డీవో గణేష్ చింతకాని తహసీల్దార్ రమేష్‌కు సూచించారు. దాంతో శనివారం తహసీల్దార్ మండలంలోని పొద్దుటూరు, నేరడ, మత్కేపల్లి నామవరం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు సుమారు 10ఎకరాల భూమి అవసరం ఉన్న నేపథ్యంలో అందుకు అనువుగా ఉన్న స్థలాన్ని గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

జ్వరాలతో అల్లాడుతున్న పల్లెజనం

రాయగూడెం, పైనంపల్లి గ్రామాల్లో ఉధృతం

నేలకొండపల్లి, ఫిబ్రవరి 10: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. డెంగ్యూ, వైరల్ ఫీవర్స్, కాళ్లనొప్పులు తదితర రోగాలతో తల్లడిల్లుతున్నారు. దీంతో గ్రామీణ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మండలంలో ప్రధానంగా రాయగూడెం, పైనంపల్లి గ్రామాల్లో జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. రాయగూడెంలో ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు.

గ్రామీణ వైద్యులనాశ్రయిస్తున్న రోగులు

గ్రామాల్లో జ్వరాలతో బాధపడే వారు తొలుత గ్రామీణ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు జ్వరాలను త్వరగా తగ్గించేందుకు నిబంధనలకు విరుద్ధంగా అధిక మోతాదులో ఇంజక్షన్లు చేస్తున్నారని రాయగూడెం, పైనంపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

స్టెరాయిడ్స్ వాడుతున్నట్లున్నారు

డాక్టర్ శ్రావణ్‌కుమార్, పీహెచ్‌సీ అధికారి, నేలకొండపల్లి

జ్వరాలు రాయగూడెంలో ఎక్కువగా ఉన్నాయన్న విషయాన్ని వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లగా జ్వరాలున్న మాట వాస్తవమేనన్నారు. కానీ చాలావరకు తగ్గుముఖం పట్టాయని, ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. శుక్రవారం రాయగూడెం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించామని, 160మంది వరకు చికిత్స అందించామన్నారు. వైద్యసిబ్బందితో ఇంటింటి సర్వే చేయిస్తున్నట్టు తెలిపారు. అదే సమయంలో ఆర్‌ఎంపీలు తమ పరిధి దాటి వ్యవహరిస్తున్నట్లుగా తెలిసింది. రోగులు తెచ్చిన పరీక్షా రిపోర్టుల్లో దాదాపు అన్నీ ఒకే రకంగా ఉన్నాయని, స్టెరాయిడ్స్ వాడుతున్నారన్న అనుమానం ఉందన్నారు. గ్రామీణ వైద్యులు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలన్నారు. నేలకొండపల్లిలో 24గంటల వైద్యసదుపాయం ఉందని, ప్రజలు దీన్ని ఉపయోగించుకోవాన్నారు.

అదేవిధంగా పైనంపలిల్లో కూడా వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయని, ఇక్కడ కూడా వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మనోవేదనతో ఒకరు.. మతిస్థిమితం లేక మరొకరు !

- వేర్వేరు ఘటనల్లో పురుగులమందు తాగి ఇద్దరి ఆత్మహత్య

పాల్వంచ, ఫిబ్రవరి 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం వేర్వేరు ఘటనల్లో పురుగుమందు తాగి ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాల్వంచ నవభారత్ ప్రాంతంలోని పాలకొయ్యతండాకు చెందిన భూక్యా వెంకటేశ్వర్లు(25) స్థానికంగా కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే తనకు వివాహం కావడం లేదని, తనను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఇటీవల తరచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మొదట పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, తరువాత మెరుగైన చికిత్స కోసం కొత్తగూడేనికి అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ టౌన్ ఎస్‌ఐ బానాల రాము తెలిపారు. మరో ఘటనలో పాల్వంచ కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న బొల్లోరిగూడేనికి చెందిన లకావత్ అప్పారావు(46) ఈ మధ్య కాలంలో మతి స్థిమితం తప్పి వింతగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం పురుగుల మందు తాగాడు. తరువాత ఇంట్లో వాంతి చేసుకుంటుండగా గమనించిన అతడి భార్య మంగ స్థానికుల సాయంతో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. తరువాత మెరుగైన వైద్యం మందు కొత్తగూడేనికి అనంతరం అక్కడినుంచి హైదరాబాదుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పారావు శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ అడిషనల్ ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.

వర్క్‌ఫ్రం హోమ్ పేరుతో టోకరా

పాల్వంచ, ఫిబ్రవరి 10: వర్క్‌ఫ్రం హోమ్ పేరుతో సైబర్ నేరగాళ్లు చేసిన మోసానికి ఓ మహిళ రూ.94వేలు పోగొట్టుకుంది. పాల్వంచ నెహ్రూనగర్‌కు చెందిన కాలవ దివ్య వాట్సాప్‌లో వర్క్‌ఫ్రం హోమ్ పేరుతో ఓ సైట్ అడ్రస్ రావడంతో టెలిగ్రాంలో దాని లింక్‌ను తెలుసుకొని ఆ అడ్రస్‌లో పేర్కొన్న అకౌంట్‌కు పలు దఫాలుగా రూ.94 వేలు జమ చేసింది. చివరకు తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం పాల్వంచ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనికేషన్ రంగంతోనే భవిష్యత్తు

- సత్తుపల్లి 'మదర్‌థెరిస్సా'లో ముగిసిన వర్క్‌షాప్

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 10: విద్యార్థులకు కమ్యూనికేషన్ రంగంతోనే భవిష్యత్ ఉంటుందని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. సత్తుపల్లి మండలంలోని కొత్తూరులో మదర్‌తెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. 'ఫండమెంటల్స్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ మ్యాట్ ల్యాబ్'పై జరిగిన వర్క్‌షాప్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆయా ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీటెక్, ఎమ్‌టెక్ ఈసీఈ విభాగం విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల రీసోర్స్ పర్సన్ డాక్టర్ ఎల్వీ.రజనికుమారి మిషన్ లెర్నింగ్ అప్లికేసన్స్, సిమ్యూలేషన్ పద్ధతిలో మ్యాట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్ ద్వారా వివరించారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను ఎలా రూపొందించవచ్చునో నేర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ జీ.ఉదయ్‌కిరణ్ భార్గవ్, ఈసీఈ విభాగం అధ్యపకులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న తెలుగు రాష్ట్రాల విద్యార్థులు

గుండెపోటుతో సీపీఐ కార్యకర్త మృతి

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని ఏదులాపురం గ్రామానికి చెందిన సీపీఐ కార్యకర్త చెరుకుపల్లి వెంకటేశ్వర్లు (40) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శేషగిరి, తాటి వెంకటేశ్వర్లు, చిన్న వెంకటరెడ్డి, భాస్కర్, దండి రంగారావు, సురేందర్, రమేష్, రాము, వీరబాబు, కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్, రవి, అశోక్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

తాళ్లమడలో కారు ఢీకొని వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 10: జాతీయ రహదారిపై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అతను మృతిచెందిన సంఘటన శనివారం సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఇజ్జగాని చెన్నారావు వివరాల ప్రకారం.. సత్తుపల్లి మునిసిపాలిటీలోని బైపాస్‌రోడ్‌లో నివాసం ఉంటున్న మామిడి రాంబాబు (56) మండలంలోని తాళ్లమడలో ఓ రైస్ మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రైస్‌మిల్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో తాళ్లమడకు చేరుకోగా అదే సమయంలో కొత్తగూడెం నుంచి రాజమండ్రి వైపునకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన రాంబాబును 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందిచారు. మెరుగైన వైద్యంకోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య సీతారావమ్మ, కుమార్తె రజిని, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మామిడి రాంబాబు (ఫైల్)

నలుగురు ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 10: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నలుగురు ట్రాక్టర్ డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదుచేశారు. ముజాహిద్‌పురానికి చెందిన నల్లగట్టు మధు, పుల్లారి వీరయ్య, మహేందర్, ప్రభాకర్ పాలేరు రిజర్వాయర్ నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏఎస్‌ఐ రాఘవ తన సిబ్బందితో కలిసి శనివారం ముజాహిద్‌పురం వెళ్లాడు. దీంతో సదరు వ్యక్తులు పోలీసులపై తిరగబడ్డారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అనంతారంలో క్షుద్ర పూజల కల కలం

జూలూరుపాడు, ఫిబ్రవరి 10: మండలంలోని అనంతారం గ్రామంలో క్షుద్ర పూజల కలకలం మొదలైంది. గ్రామానికి చెందిన కొర్సా రమేష్ కిరణా షాపు ముందు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టి పూజలు నిర్వహించినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. శనివారం ఉదయం దుకాణం తెరిచేందుకు రమేష్ వెళ్లగా అక్కడ పసుపు, కుంటుమ, నిమ్మకాయలను, బొమ్మలను వదిలి వెళ్లారు. జరిగిన సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి: టీడీపీ

మధిర రూరల్, ఫిబ్రవరి 10: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని టీడీపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు డా. వాసిరెడ్డి రామనాథం డిమాండ్ చేశారు. ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరుతూ శనివారం మధిర క్లబ్ సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి రామనాధం మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతో తెలుగు రాష్ట్రాల్లోని పేద, దళిత, గిరిజన, మధ్య తరగతి వర్గాలకు అన్ని రకాలుగా న్యాయం జరిగిందన్నారు. పేదలకోసం విస్తృంగా సంక్షేమ పథకాలు తీసుకొచ్చింది ఎన్‌టీఆరే అని తెలిపారు. యుగపురుషుడు ఎన్టీఆర్‌కు తక్షణమే భారతరత్న ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, శేఖర్‌బాబు, హనుమంతరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రోలింగ్ విష సంస్కృతిని తిప్పికొడతాం

- ఘనంగా ప్రారంభమైన ప్రరవే 7వ రాష్ట్ర మహాసభలు
- తరలివచ్చిన అభ్యుదయ మహిళలు
- 'ట్రోలింగ్' పుస్తక ఆవిష్కరణ

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 10: సమాజ జాఢ్యంగా మారుతున్న ట్రోలింగ్ విషసంస్కృతిని సమర్ధవంతంగా తిప్పికొడతామని రచయిత్రులు ప్రకటించారు. ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో ప్రజా రచయిత్రుల వేదిక 7వ మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 150 మంది మహిళా రచయిత్రులు, అభ్యుదయ సంఘాల మహిళలు, సామాజిక కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నంబూరి పరిపూర్ణ ప్రాంగణంలో ప్రరవే జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి కేఎన్ మల్లీశ్వరి సభల లక్ష్యాలను వివరించారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ట్రోలింగ్‌లకు భయపడి మనోధైర్యం కోల్పోమని ధైర్యంగా ఎదుర్కోవటంతోపాటు తోటి బాధితులకు అండగా నిలుస్తామన్నారు.

ట్రోలింగ్ వ్యతిరేక సమూహాలుగా ఏర్పడాలి
ఎన్. వేణుగోపాల్

సమాజానికి సవాల్‌గా మారుతున్న ట్రోలింగ్ భూతాన్ని తరిమేందుకు బాధితులు సమూహాలుగా ఏర్పడటం ద్వారా పోరాటాలను విస్తృతం చేయాలని వీక్షణం సంపాదకుడు, విరసం మాజీ నేత ఎన్. వేణుగోపాల్ అన్నారు. ఖమ్మంలో మొదలైన ప్రజా రచయిత్రుల వేదిక రాష్ట్ర మహాసభల్లో ఆయన 'ట్రోలింగ్ నిర్వచనం, మూలాలు, వర్తమానం' అనే అంశాలపై ప్రసంగించారు. పితృస్వామ్య భావజాలంతో సాంస్కృతిక రాజకీయ రంగా ల్లో ట్రోలింగ్ ఉందన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా వివిధ మతాలపై రాజ్యం ప్రేరేపిస్తున్న ట్రోలింగ్, వ్యక్తిగత ట్రోలింగ్‌లు ముప్పేట దాడులను సాగిస్తున్నాయన్నారు. తనపై జరిగిన ఎన్ఐఏ దాడులను ప్రసావిస్తూ దాడులు తన మనోధైర్యాన్ని, పనితీరును తగ్గించబోవన్నారు.

రచయిత్రి కొండేపూడి నిర్మల మాట్లాడుతూ రాజకీయాల్లో ట్రోలింగ్ కారణంగా సరైన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేసే ధైర్యం కోల్పోతున్నారని అన్నారు. పనితీరును కాక లైంగిక ఆరోపణలకు దిగటం ద్వారా మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. మరో వక్త కృష్ణకుమారి, ప్రరవే రాష్ట్ర కార్యదర్శి కాత్యాయిని విద్మహే, జహా ఆరా, తిరునగరి దేవకి దేవి, బీబీసీ తెలుగు ఎడిటర్ జీఎస్ రామ్మోహన్ తదితరులు ప్రసంగించారు.

ట్రోల్ పుస్తక ఆవిష్కరణ

సామాజిక మాధ్యమాల్లో ఇటీవల ట్రోలింగ్‌కు గురైన బాధితుల కథనాలతో రూపొందించిన ట్రోల్ పుస్తకాన్ని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేధింపులకు మహిళలు భయపడొద్దని ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ట్రోలింగ్‌లకు భయపడితే మహిళలు తమ పోరాట పటిమ కోల్పోతారని చెప్పారు. ట్రోల్ పుస్తకాన్ని మరో ప్రముఖ రచయిత్రి వి. ప్రతిమ పరిచయం చేశారు. బాధితుల కథనాల్లో ఎంతో నిజాయితీ ఉందని చెప్పారు. విద్యావేత్త రవిమారుత్


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, కార్యదర్శి కేఎన్ మల్లీశ్వరి

మాట్లాడుతూ బాధితులు మానసిక ధైర్యం కోల్పోకుండా పోరాట సామర్ధ్యాన్ని పెంచుకోవాలన్నారు. సమాజంలో ఉద్దేశ్య పూర్వక ట్రోలింగ్ కుసంస్కృతి పెచ్చుమీరుతోందని అన్నారు. ప్రముఖ పాత్రికేయురాలు సి, వనజ, సామా


ప్రసంగిస్తున్న ఎన్. వేణుగోపాల్, ఓల్గా, సి. వనజ

జిక కార్యకర్త దీప్తి తమ ట్రోలింగ్ అనుభవాలను వివరించారు.

ఆకట్టుకున్న ఏకపాత్రాభినయం

ప్రజారచయిత్రుల వేదిక రాష్ట్ర మహాసభల్లో భాగంగా ప్రముఖ స్త్రీవాద కవయిత్రి రేణుక అయోల ప్రదర్శించిన కుంతి ఏకపాత్రాభినయం సభికులను ఆకట్టుకుంది. పృధ అనే తన రచనను ఏక పాత్రగా మలచి రేణుక అద్భుతంగా ప్రదర్శించారు.


హాజరైన కవులు, రచయితలు

జాతీయ అధ్యక్ష కార్యదర్శులుగా రజిత, మానస

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 10: ప్రజా రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్ష కార్యదర్శులుగా అనిశెట్టి రజిత, ఎండ్లూరి మానసను ఎన్నుకున్నారు. ఖమ్మంలో జరుగుతున్న ప్రరవే రాష్ట్ర మహాసభల సందర్భంగా సంఘం ఆనవాయితీలో జాతీయ, తెలంగాణ, ఆంధ్ర కమిటీల కార్యవర్గాన్ని ప్రకటించారు. జాతీయ అధ్యక్షురాలిగా అనిశెట్టి రజిత, కార్యదర్శిగా ఎండ్లూర మానసతోపాటు సమన్వయ కర్తగా పి. రాజ్యలక్ష్మీ, కోశాధికారిగా కొమ్రరాజు రామలక్ష్మి, ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షురాలిగా పి. అమరజ్యోతి, కార్యదర్శిగా కేఎన్ మల్లీశ్వరి, సమన్వయకర్తగా కావూరి శారద, నియామక ప్రతినిధిగా జహాఆరా, కార్యవర్గ సభ్యులుగా మందరపు హైమవతి, రచన శృంగవరపు, లక్ష్మీసుహాసిని, తెలంగాణ అధ్యక్ష కార్యదర్శులుగా తిరునగరి దేవవిదేవి, కాత్యాయినివిద్మహే, సమన్వయ కర్తగా బండారి సుజాత, నియామక ప్రతినిధిగా తాళ్లపల్లి యాకమ్మ, కార్యవర్గ సభ్యులుగా శాంతి ప్రబోధ, షహనాజ్ బేగం, పాత శ్రీలక్ష్మి, కొలిపాక శోభారాణి, గిరిజన ప్రతినిధిగా కుంజ కళ్యాణిలను నియమించారు.


అనిశెట్టి రజిత, ఎండ్లూరి మానస

రూ.8వేల కోట్లతో జాతీయ రహదారులు

(ఐదో పేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టాం. ఇది వచ్చే అక్టోబరు నాటికి పూర్తయ్యే లక్ష్యంగా చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని ప్యాకేజీల పనులు 36శాతం పూర్తయ్యాయి. ఈ రహదారికి మొత్తం ఏడుచోట్ల ఎగ్జిట్‌పాయింట్లు ఏర్పాటు చేశాం. ఈ రహదారి ఖమ్మంమీదుగా విశాఖ, రాజమండ్రికి ప్రయాణ దూరాన్ని తగ్గిస్తుంది.

ప్ర: కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి ఎప్పట్లోగా పూర్తవుతుంది ?

జ: కోదాడ నుంచి ఖమ్మం వరకు 31.8కి.మీ. రహదారి పనులు రూ.1,039కోట్లతో కొనసాగుతున్నాయి. వాస్తవానికి ఈ హైవే పనులు 2022 జనవరి 15కు పూర్తి కావాల్సి ఉంది. భూసేకరణతో కొంత జాప్యం వల్ల నిర్మాణం ఆలస్యమైంది.

మార్చి నాటికి పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నాం. దీనివల్ల విజయవాడ-ఖమ్మం రహదారికి ప్రయాణ సౌలభ్యం సులభం అవుతుంది.



ముగిసిన 'అణుశక్తి' క్రీడా,సాంస్కృతిక పోటీలు

అశ్వాపురం, ఫిబ్రవరి 10: అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో ఈనెల 6వ తేదీనుంచి జరుగుతున్న భారత అణుశక్తి విభాగం 38వ జాతీయ క్రీడా,సాంస్కృతిక పోటీలు శనివారం సాయంత్రం వైభవంగా ముగిశాయి. క్రీడా,సాంస్కృతిక పోటీల్లో భాగంగా ఈపడాది సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ముగింపు పోటీలకు హెవీవాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్, అణుశక్తి కమిషనర్ ఆర్థిక విభాగం సభ్యురాలు సీమాజైన్ ముఖ్యఅతిథులుగా హజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో క్రీడా స్ఫూర్తిని విస్తరింపజేయటంలో అణుశక్తి విభాగం తనవంతు పాత్ర పోషిస్తోందన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు మనస్సుకు ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొదిస్తాయన్నారు. దేశంలోని అన్ని యూనిట్ల నుంచి కళాకారులు ఒకేవేదిక మీదకు రావటం సంతోషకరమని పేర్కొన్నారు. ఆహ్లాదభరిత వాతావరణంలో జరిగిన పోటీలు ఉద్యోగుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొదిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ జీఎం ఎస్.జగ్గారావు, క్రీడా,సాంస్కృతిక పోటీల కన్వీనర్ హెచ్.కె.శర్మ, రసీఐవో వేణు, ఐఆర్‌వో లత, ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

విజేతలు వీరే.. వోకల్‌లైట్, క్లాసిక్ మ్యూజిక్, హిందుస్థానీ గాత్ర సంగీతం, బృందనృత్యాలు, హిందుస్థానీ, పాశ్చాత్య పెర్కసన్, కర్ణాటక వాయిద్య సంగీతాల పోటీల్లో అజంతా, ఎల్లోరా, రామేశ్వరమ్,పుష్కర్‌జట్లకు చెందిన కళాకారులు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. ఉత్తమ కళాకారుడిగా పుష్కర్ జట్టుకు చెందిన నరేంద్రకుమార్ శర్మ ఎంపికయ్యారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

- భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు
- రుద్రంపూర్‌లో ప్రారంభమైన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

చుంచుపల్లి, ఫిబ్రవరి 10: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు అన్నారు. శనివారం మండలంలోని రుద్రంపూర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో శనివారం రాష్ట్రస్థాయి 9వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో చిన్నారులు సెల్‌ఫోన్లకే పరిమితం అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందువల్ల వారి మేధోశక్తి పెరగడం లేదని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ తమ పిల్లలను క్రీడల వైపు నడిపించేందుకు కృషి చేయాలని, క్రీడా స్ఫూర్తితో మెలగాలని గెలుపోటములు సహజమన్నారు. ఈ పోటీలకు 32 జిల్లాల నుంచి 900 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం టీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. క్రీడా పోటీల్లో విజేతలకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, జిల్లా కార్యదర్శి కె.మహిదర్, వైస్ ఎంపీపీ మల్లికార్జున్, తాండ్ర నాగబాబు, ఇనుగంటి రాము, తాండ్ర బుచ్చిబాబు, ప్రభాకర్, జిదుల రాజేశ్వరరావు, చలింటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


వివిధ పోటీల్లో విజేతలైన క్రీడాకారులు

ఎన్నికల్లో గెలవడానికే కాంగ్రెస్ అబద్ధాలు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదద్మి గుజ్జుల

ఖమ్మం బైపాస్‌రోడ్, ఫిబ్రవరి10: ఎన్నికల్లో గెలవడానికి మాత్రమే కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెబుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యద్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని జిల్లాపార్టీకార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందని, కాళేశ్వరం విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ చేపిస్తామని మాటలుచెప్పి ఇప్పుడు దానిని మరిచారన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం బీజేపీ గెలుచుకుంటుందని, ప్రజలు బీజేపీకి అండగా నిలబడుతున్నారన్నారు. పీవీ నర్సింహారావుకు భారతరత్న రావడం హర్షణీయమని అన్నారు. ఈసమావేశంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్రనాయకులు గంటేల విద్యాసాగర్, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నున్నా రవికుమార్, మంద సరస్వతి, వీరెల్లి లక్ష్మయ్య, అల్లింక అంజయ్య, చావా కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

నిఘా కళ్లు గప్పి...

- ఒడిషా నుంచి భద్రాచలం మీదుగా గంజాయి రవాణా
- పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఆగని దందా
- వరుస ఘటనలతో నిఘా తీవ్రం

కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఒడిషా రాష్ట్రం నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్, రాజస్థాన్, మహారాష్ట్ర, డిల్లీ రాష్ట్రాలకు యధేచ్ఛగా గంజాయి రవాణా జరుగుతోంది. ఈ అక్రమార్కులు పోలీసుల కళ్లు గప్పి గంజాయిని పెద్ద ఎత్తున తరలించి లక్షలాది రూపాయల దండుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలపై పోలీసులు నిఘాపెట్టి ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. దీంతో పోలీసులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేశారు. అయినా ప్రతీ రోజు గంజాయి ఏదో రకంగా పలు వాహనాల్లో అక్రమంగా రవాణ జరుగుతూనే ఉంది. తరుచూ పోలీసులు ఆయా వాహనాలను తనిఖీలు చేపట్టడంతో గంజాయిని పట్టుకుంటున్నారు.

ఆరునెలల్లో భారీగా పట్టివేత..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసులు, టాస్కుఫోర్స్ సిబ్బంది ఆరు నెలలుగా సుమారు 2000 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 37మంది నిందుతులను సైతం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ రవాణా చేసే 37 వాహనాలను సీజ్ చేశారు. గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయినప్పటికి గంజాయి రవాణాను అక్రమార్కులు కొనసాగిస్తునే ఉన్నారు.

వయా భద్రాచలం..

భద్రాచలం ప్రాంతం ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంగా ఉండటంతో ఆ రాష్ట్రాల్లో అక్రమంగా పండిస్తున్న గంజాయిని వయా భద్రాచలం మీదుగా తరలిస్తున్నారు. ఒడిషా రాష్ట్రంలోని మల్కన్‌గిరి, ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం ప్రాంతంలో ఆదివాసులు ఎక్కువగా నివసిస్తుంటారు. ఆ ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండటంతో గంజాయి అధికంగా జరుగుతుంది.


కొత్తగూడెంలో పట్టుబడిన గంజాయి

వాహనాల్లో తరలింపు..

పోలీసులు, ఎక్సైజ్ నిఘా ఎక్కువగా లేకపోవడంతో గంజాయి రవాణా చేసే అక్రమార్కులు సాగు చేసేవారితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. గంజాయిని కొనుగోలు చేసి అనుమానం రాకుండా రాకుండా బస్సులు, లారీలు, వ్యాన్, ట్యాంకర్‌లలో రవాణా చేస్తున్నారు. భద్రాచలం, బూర్గంపాడు,పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ సమయంలో తరుచూ గంజాయి పటుబ్బడుతుండటం ఇందుకు నిదర్శనం.ఇటీవల ఖరీదైన కార్లలో, కంటైనర్‌లలో ప్యాకింగ్ చేసిన గంజాయిని రవాణా చేస్తున్నారు. ప్రైవేటు, ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్నారు. ఇందుకు మహిళలను ఉపయోగిస్తున్నారు. భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట పట్టణాలతోపాటు ఆయా సమీప మండలాల్లో గంజాయి రవాణా జరుగుతోంది.

గంజాయిని సేవిస్తూ యువత బానిసలవుతున్నారు. క్షణికావేశంలో అఘాయిత్యాలకు పాల్పడతుఉన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం మత్తుకు బానిసలవుతున్నారు. గంజాయి చాక్లెట్స్ కూడా విక్రయిస్తున్నారు. దీంతో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్‌పార్టీ పోలీసులు సైతం పాన్ షాపులు, కిరాణ దుకాణాల్లో తనిఖీలుచేపట్టారు.

విద్యా, వైద్యం పౌరుడి ప్రాథమిక హక్కు

- న్యాయాధికారి అరుణకుమారి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి10: విద్య, వైద్యం పౌరుడి ప్రాథమిక హక్కు. అని సత్తుపల్లి న్యాయాధికారి పి. అరుణకుమారి అన్నారు. లయన్స్ క్లబ్, చేతన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన కేన్సర్ వైద్య శిబిరాన్ని మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిష్ణాతులైన వైద్యుల పర్యవేక్షణలో 215మందికి పరీక్షలు చేయగా నలుగురు మాత్రమే నిర్ధారణ అయినట్లు నిర్వహకులు తెలిపారు. ఖరీదైన, ఉన్నత ప్రమాణాలు కలిగిన వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం, పేద, మధ్య తరగతి ప్రజానీకానికి కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన శిబిరం నిర్వాహకులను న్యాయాధికారి అభినందించారు. చేతన పౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, నిర్వహకులు దొడ్డా కృష్ణయ్య, మందపాటి ప్రభాకర రెడ్డి, పెనుగొండ రమేష్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మెడికల్ రిపోర్టును పరిశీలిస్తున్న వైద్యుడు

గ్రానైట్ లోకల్ ట్రేడర్స్, మార్కర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 10: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని లోకల్ గ్రానైట్ ట్రేడర్స్, మార్కర్స్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తక్కెళ్లపల్లి అశోక్, ఉపాధ్యక్షులుగా నునావత్ కిషన్, అబ్దుల్ రహీం, కార్యదర్శిగా ఎస్కే. జాని, కోశాధికారిగా నవీన్‌కుమార్‌తో పాటు పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమపై ఆధారపడిన వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వెంపటి ఉపేందర్, గౌరవ సలహాదారు అదాలత్ నరేందర్ పాల్గొన్నారు.

గ్రూప్-4 విజేతలు...

ఉమ్మడి జిల్లాలో ప్రథమం



మణుగూరుటౌన్, ఫిబ్రవరి 10: మణుగూరు సింగరేణి కాలరీస్ ఏరియా మణుగూరు జీఎం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వనపర్ల అభిలాష్ గ్రూప్-4 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో ప్రథమ ర్యాంకు, స్టేట్‌లో 7వ ర్యాంకును సాధించాడు. సింగరేణి ఉద్యోగి ప్రసాద్, ప్రభుత్వ ఉపాధ్యాయని బాయమ్మల ఏకైక సంతానం అభిలాష్. 2016లో జరిగిన జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు జరిగిన పరీక్షల్లో సింగరేణిలో క్లర్క్‌గా ఉద్యోగం సాధించాడు. తర్వాత గ్రూప్-4 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రికార్డు ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ .. సింగరేణి ఉద్యోగాన్ని వదిలి గ్రూప్-4 ఉద్యోగానికి వెళతానని తెలిపారు. తన విజయానికి కారకులైన తల్లిదండ్రులకు, సహకరించిన సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా స్థాయిలో 57వ ర్యాంకు



వైరా, ఫిబ్రవరి10: వైరా మునిసిపాలిటిలోని బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన షేక్ అజీజ్ అహ్మద్ గ్రూప్-4 ఫలితాల్లో జిల్లాస్థాయిలో 57వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 1300 ర్యాంకు సాధించాడు. అజీజ్‌అహ్మద్ తండ్రి షేక్ బాబుజాని వైరా ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా(కానిస్టేబుల్) పని చేస్తున్నాడు. ఇటీవల ప్రకటించిన పోలీస్‌కానిస్టేబుల్ ఫలితాల్లో సైతం అజీజ్‌అహ్మద్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకు సాధించాడు. ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించిన అజీజ్ అహ్మద్ గ్రూప్-1 సాధించడమే లక్ష్యమని తెలిపాడు.

సంక్షోభంలో విద్యారంగం

- నేడు, రేపు విద్యా వైజ్ఞానిక మహాసభలు
- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 10: 'అంతరాలు లేని విద్య ప్రజల హక్కు, ప్రభుత్వ బాధ్యత, నూతన విద్యా విధానం 2020 రాజ్యాంగ విలువలు' అనే అంశాలపై ఖమ్మంలో ఆది, సోమవారాల్లో (11, 12వ తేదీలు) టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, సహాధ్యక్షుడు మనోహరరాజు తెలిపారు.

నగరంలోని నయాబజార్ పాఠశాల మహాసభల ప్రాంగంణం వద్ద శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత ఏపీటీఎఫ్ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్)గా మారి, అవే ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల, మహిళల అభివృద్ధికి విద్య తోడ్పడాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నాయని, దరిమలా విద్యారంగం రోజు రోజూ సంక్షోభంలో కూరుకు పోతున్నదని, విద్యను పొందాల్సిన పేదల పిల్లలు, విద్యారంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులూ సమస్యలలో ఉన్నారని తెలిపారు. ఏళ్ల తరబడి అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, కామన్ సర్వీస్ రూల్స్, పండితుల, పిఇటిల అప్గ్రేడేషన్ కోర్టుల్లో నానుతున్నాయన్నారు.

ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను పార్టీలు వారి వారి మ్యానిఫెస్టోల్లో చేర్చడం జరిగిందని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని కొత్త ప్రభుత్వం మీద అనేక ఆశలు పెట్టుకున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణను ప్రకటించాలని టీపీటీఎఫ్ కోరుతుందన్నారు.

ప్రస్తుత మహాసభల్లో విద్యారంగ,సామాజిక,ఆర్థిక,అంతర్జాతీయ అంశాలపై బుర్రా రమేష్, జి.హరగోపాల్, ఎ.నర్సింహారెడ్డి, సి.కాశీం, చందనా చక్రవర్తి, ఎన్.వేణుగోపాల్, పి.ప్రసాద్ లాంటి మేధావులు ప్రసంగిస్తారని చెప్పారు. 11న సాయంత్రం 4 గంటలకు ఖమ్మం పట్టణంలో ఉపాధ్యాయుల, విద్యారంగ, సామాజిక సమస్యలను ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ ఉంటుందని, ఆ తదుపరి జరిగే బహిరంగ సభలో కోదండరాం, గుమ్మడి నర్సయ్య, టి.రమేశ్, వి.సంధ్య, విమలక్క తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అత్యధిక సంఖ్యలో మహాసభలలో పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవిందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు కడారి భోగేశ్వర్,సిద్దోజు కవిత, మాడుగుల రాములు,ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నం

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 10: తనను ఐఎన్‌టీయూసీ సంఘం నుంచి అకారణంగా బహిష్కరించారని మనస్తాపం చెందిన సింగరేణి సెక్యూరిటీ గార్డ్ లింగాల జగన్నాథం శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న షుగర్ మాత్రలను పొడి చేసుకుని తాగాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ఇల్లెందు సింగరేణి వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.


చికిత్స పొందుతున్న జగన్నాథం

ఘనంగా బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 10: అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాద చార్యులు సాంప్రదాయ రీతిలో శాస్త్రోక్తంగా పూజలు, అర్చనలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రెండు రాష్ట్రాలకూ పట్టని రహదారి

- ఈ రహదారి గుండా వెళ్లాలంటే నరకమే
- తెలంగాణ-ఏపీ సరిహద్దుల్లో రోడ్ల పరిస్థితి అధ్వానం
- విలీన కష్టాలు అంతా ఇంతా కాదు
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు


ఏపీలోని ఎటపాక మండలం చింతలగూడెం వద్ద

భద్రాచలం, ఫిబ్రవరి 10: ఈ ఫోటోలో మీకు కనిపిస్తున్న రహదారి తెలంగాణ-ఏపీ సరిహద్దుల్లోని అల్లూరి జిల్లా యటపాక మండలంలోనిది. భద్రాచలం-చర్ల మార్గంలో ఏపీ పరిధిలో ఉన్న ప్రాంతంలో ఉన్న రహదారిపై రాకపోకలు సాగించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఈ క్షణాన ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో వాహనాల రాకపోకలు నిత్యం సాగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రహదారిపై ఉన్న గుంతలను అంచనా వేయలేక రహదారిపై పడిపోయిన ద్విచక్ర వాహన చోదకులు ఎందరో తమ కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రధాన రహదారిపై పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పోలవరం ముంపు మండలాలు ఏపీ పరిధిలోకి వెళ్లడంతో తెలంగాణ రాష్ట్ర ఆర్అండ్‌బీ అధికారులు పనులు చేపట్టలేమంటున్నారు. మరో వైపు ఏపీ పరిధిలోని సంబంధిత శాఖ అధికారులకు ఈ రహదారి గురించి పట్టింపు లేదంటే అతిశయోక్తి కాదు. భద్రాచలం- చర్ల మార్గంలో యటపాక మండలం నుంచి చెన్నంపేట, సీతంపేట, కన్నాయిగూడెం మీదుగా తెలంగాణలోని తూరుబాక గ్రామంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఈ మధ్యలో పలు చోట్ల లోతైన గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఈ రహదారి గుండా వెళ్లాలంటే నరకమే

తెలంగాణలోని భద్రాచలం-చర్ల మార్గంలో ఏపీ పరిధిలోని రహదారిపై వెళ్లాలంటే నరకమే కనిపిస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. మేడువాయి నుంచి కన్నాయిగూడెం వరకు ఎనిమిది కి.మీ. పరిధిలో వాహన చోదకులు ఏపీలో ప్రయాణించాల్సి ఉండటంతో వారి కష్టాలు వర్ణనాతీతమని చెప్పక తప్పదు. ఈ రహదారిలో 20 కి.మీ. వేగం మించకుండా గుంతలను అధికమిస్తూ చేసే ప్రయాణం ఎంతో ప్రమాదకరంగా ఉంటోంది. అంతేకాదు ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి అయితే మరింత సంక్లిష్టమే. లోతైన గుంతలు ఉండటంతో ఆ రహదారిపై బండి నడిపే సమయంలో అదుపు తప్పి పడిపోయి కాళ్లు, చేతులు విరిగిన వాహన చోదకులు పలువురు ఉండటం గమనించదగ్గ విషయం. ఇటువంటి ఘటనలు అనేకసార్లు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పరిస్థితి నానాటికీ తీవ్రంగా మారుతోందన్న ఆందోళనల్లో ప్రజల్లో వ్యక్తమవుతోంది. పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా ఏపీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో సమస్య జఠిలంగా మారుతోంది.

విలీన కష్టాల్లో ఇదో కోణం

పోలవరం ముంపు మండలాల పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన అనంతరం వాటి ఆలనపాలన మరిచారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తూనే ఉన్నాయి. వరదల సమయంలో ఆదుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు ఆ ప్రాంతవాసుల నుంచి తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. అయితే భద్రాచల పుణ్యక్షేత్రం నుంచి పర్ణశాల రామాలయంకు నిత్యం వేలాది మంది భక్తులు ఆటోలు, టాటా మ్యాజిక్, బస్సులు, కార్లలో వెళ్తుంటారు. ఈ సమయంలో లోతైన గుంతలతో ఉన్న రహదారి వచ్చిందంటే ఏపీ పరిధిలోకి వచ్చామా అని ఆ సమయంలో ప్రయాణించే భక్తులు చర్చించుకుంటున్నారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అవగతమవుతోంది. ఇంతటి ప్రధాన రహదారిని చక్కదిద్దేందుకు ఇకనైనా ఏపీలోని సంబంధిత ఇంజనీరింగు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని రామ భక్తులు కోరుతున్నారు. లేదంటే జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా ఈ ప్రాంతాన్ని ఆ పరిధిలోకి తెచ్చి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని రామ భక్తులు ఆకాంక్షిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

కోర్టు డ్యూటీ అధికారులు బాధ్యతగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి కోర్టు డ్యూటీ అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ బి. రోహిత్ రాజ్ అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన జిల్లా పోలీస్ విభాగంలో కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోర్టు డ్యూటీ అధికారులకు సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చేలా బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలయజేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రస్తుతం కోర్టు డ్యూటీ అధికారులకు విధులలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు సీఐ రమాకాంత్, ఎస్బీ ఇన్స్పెక్టర్ నాగరాజు, కొత్తగూడెం 2 టౌన్ సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతా సభను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10: మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మంలో మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినేపల్లి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో మహాసభ పోస్టర్‌లను విడుదల చేసారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ నేడు భారతదేశంలో పాసిస్టు ప్రమాదం పెరుగుతుందని, ఈ తరుణంలో విప్లవ కారులంతా ఐక్యత కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బహిరంగ సభకు మన మండలం నుండి ప్రజలను కదిలించి బహిరంగ సభను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఆయన పిలపునిచ్చారు. మారిన కాలానికి అనుగుణంగా విప్లవ కారులు కాలం చెల్లిన విధానాలను అనుసరించడం వలన విప్లవానికి ప్రజలు దూరమవుతున్నారని, దీనిపై చర్చించేందుకు ఈ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న రాము

దమ్మపేట, ఫిబ్రవరి, 10: బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న చేపట్టే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు అమర్లపూడి రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతు బీజేపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రభుత్వమని పది సంవత్సరాలలో రైతులకు ,పేదలకు చేసింది ఏమి లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో సంక్షేమరంగానికి, నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, కార్మిక రైతు సంఘాల నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, బాస్కరరావు, మద్దిశెట్టి సత్యప్రసాదు, వలీపాషా, యార్లగడ్డ బాబు, రహీం, దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

బూడిదను మాకు ఉచితంగా ఇవ్వండి


విలేకరులతో మాట్లాడుతున్న ప్రభావిత గ్రామాల ప్రజలు

పాల్వంచ, ఫిబ్రవరి 10: కేటీపీఎస్ కర్మాగారం నుంచి వచ్చే బూడిదను కాలుష్య ప్రభావిత గ్రామాలకు చెందిన ప్రజలకు ఉచితంగా ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. శనివారం వారు పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటీపీఎస్ కర్మాగారం నిర్మించిన నాటి నుంచి దాని ద్వారా వెలువడే వివిధ రకాల వ్యర్థాలతో కరకవాగు, పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం, పాండురంగాపురం గ్రామాలు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు వివిద రకాల రోగాలకు గురౌతున్నారని, పంటలపై బూడిద పడి దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని, ప్రశువుల జీవన ప్రమాణాలు కూడా దెబ్బతింటున్నాయని అన్నారు. ఇటువంటి క్రమంలో కేటీపీఎస్ యాజమాన్యం మమ్ములను ఆదుకోవడం మానేసి బూడిదను సైతం అమ్ముకుంటుందని అన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి


మాట్లాడుతున్న సాబీర్ పాషా

జూలురుపాడు, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరగనున్న గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. శనివారం జూలురుపాడు మార్కెట్‌యార్డులో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పక్కన పెట్టి రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పెట్టుబడిదారి వర్గాలకు కట్టబెట్టిందన్నారు. గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు రంగాల్లో పనిచేస్తున్న కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధు, నాగుల్‌మీరా, కృష్ణ, చాంద్‌పాషా, ముత్యాలు, జాను, బోడయ్య, శ్రీను, రామస్వామి, బాబురావు పాల్గొన్నారు.

గురుకులాలలో సమస్యలు పరిష్కరించాలి: టీఈఏ

దమ్మపేట, ఫిబ్రవరి, 10: గిరిజన గురుకులాలలో ప్రమోషన్లు, బదిలీల సమస్యలు పరిష్కరించే వరకు నూతన నియామకాలు చేపట్ట వద్దని ప్రభుత్వానికి టీఈఏ (తెలంగాణా గిరిజన గురుకుల ఉద్యోగుల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు సూతకాని శ్యామ్‌కుమార్ విజ్ఞప్తి చేసారు. దమ్మపేటలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు గిరిజన గురుకులాలలో ఉద్యోగులు సంవత్సరాల తరబడి ఏజెన్సీ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత గురుకులాలలో పూర్తి స్థాయిలో బదిలీలు, ప్రమోషన్లు లేక ఉపాధ్యాయులు సమస్యలు ఎదుర్కోంటున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రమోషన్లు, బదీలీలు జరగక పోతే ప్రస్తుతం ఖాళీగా వున్న పోస్టుల్లో కొత్తవారితో నియామకాలు చేయటం జరుగుతుందని ఏజెన్సీప్రాంతంలో ఎళ్ళ తరబడి విధులు నిర్వహిస్తున్న వారికి అన్యాయం జరుగుతుందన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 10: ఏడు రోజుల పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆళ్లపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమాలను కొత్తగూడెం ఆర్‌డీవో శిరీష పరిశీలించారు. ఆళ్లపల్లిలో డోర్ టూ డోర్ సర్వేలో డేటా ఎంట్రీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం తహసీల్ధార్ కార్యాలయాన్ని సందర్శించి మండల పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఎంపీవో శ్రీనివాసరావు, తహసీల్ధార్ వీరభద్రం, పంచాయతీ కార్యదర్శులు ప్రవీన్, నాగరాజు, కుమారి, రమేష్, వెంకటేశ్వర్లు, అన్వేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ

అశ్వాపురం, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని మొండికుంట ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఎంపీపీ ముత్తినేని సుజాత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటకాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్ధార్ స్వర్ణలత, మొండికుంట ఎంపీటీసీ నరేష్, కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తునికాకు వేలం నిర్వహించాలి

దమ్మపేట, ఫిబ్రవరి, 10: తునికాకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుడుతు వ్యవసాయకార్మిక సంఘం, ఏఐకేఎంఎస్ ఆద్వర్యంలో శనివారం తహసీల్ధార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్ధార్ ముజాహిద్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతు తునికాకు సేకరణే ఉపాధి వున్న గిరిజనుల సమస్యలు పట్టించుకోవటంలేదని విమర్శించారు.

15 నుంచి 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ఎగ్జిబిషన్': కలెక్టర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నాబార్డ్ సహకారంతో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ఎగ్జిబిషన్' (ఓడీఓఈ) అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో వన్ డే వన్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈ నెల 15,16,17 తేదీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించ నున్నట్లు తెలిపారు. కొత్తగూడెం కలెక్టరేట్, మహబూబ్ నగర్‌లో శిల్పారామం, నిజామాబాద్ రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించబడిన ఇన్నోవేటర్లు, స్టార్ట్-అప్‌లు, వ్యవస్థాపకులు, ఇన్నోవేషన్ ఉత్ప్రేరకాలుగా రాష్ట్రం మొత్తం అప్రోచ్‌తో సమ్మిళిత ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని తెలిపారు.

'పేట'కు చేరిన 'భద్రాద్రి' భక్తులు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10: తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నుండి భద్రాచలంకు కాలినడకన వెళ్ళే 400 మంది రాకభక్తులు శనివారం అశ్వారావుపేటకు చేరుకున్నారు. శుక్రవారం రాత్రికి వీరంతా అశ్వారావుపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరి బస చేసారు. శనివారం ఉదయం వీరికి ఆలయ కమిటీ, వాసవిక్లబ్, రామభక్తులు కలసి అల్పాహారం, టీలను వితరణ చేసారు. భక్తులను ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రామభక్తులు భద్రాలచం బయులుదేరి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షులు దేవరాజ్, సుమాకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10: అశ్వారావుపేటలోని వీకేడీవీఎస్ రాజు కళాశాలలో జరిగిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం వీడ్కోలు కార్యక్రమం సందర్భంగా ఈ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగ ప్రిన్సిపాల్ శేషుబాబు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు.

ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 10: మండలంలోని లక్ష్మీనగరం, దుమ్ముగూడెం గోదావరి తీరంలో ఇసుక ర్యాంపుల వద్ద రెవెన్యూ అధికారులు శనివారం కందకాలు తవ్వించారు. రాత్రివేళల్లో కొందరు ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లపై తరలిస్తున్నారంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వీలుగా ఎక్సకవేటర్ సాయంతో ఆర్ఐ ఆదినారాయణ కందకాలు తీయించారు. కాగా ఇప్పటికే తూరుబాక, సీతారాంపురం, రేగుబల్లి, గంగోలు గోదావరి ఒడ్డునుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా అధికారులు కందకాలు తవ్వించిన విషయం తెలిసిందే.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

జూలూరుపాడు, ఫిబ్రవరి 10: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా అన్నారు. జూలూరుపాడులో ఏఐవైఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రుగొండ, జూలూరుపాడు, ఏన్కూరు మండలాల స్థాయి క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్రకుమార్, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.నాగూల్‌మీరా, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతా స్వరాజ్‌రావు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్‌పాషా, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ నాయకులు యల్లంకి మధు, గుగులోత్ వంశీ, వల్లమల్ల చందర్‌రావు, నిర్వాహకులు సతీష్, వినోద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై చర్యలు

భద్రాచలం, ఫిబ్రవరి 10: వాహనాల నెంబరు ప్లేట్లు సరిగా లేని వాహనదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం ఎంవీఐ తిరుపతితో కలిసి బ్రిడ్జి సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టి రోడ్డు భద్రతా వారోత్సవాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

సింగరేణిలో స్థానికులకే ఉపాధి కల్పించాలి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 10 : సింగరేణి భూ నిర్వాసితులకు, ప్రభావిత ప్రాంత ఆదివాసీలకు ఉపాధి కల్పించాలని కోరుతూ.. ఆదివాసీ సేన నాయకులు శనివారం ఏరియా సింగరేణి జీఎంకు వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదివాసీలకు ఉపాధి కల్పించకుండా ఏరియా యాజమాన్యం తమకు నచ్చినవారికి ఉపాధి కల్పిస్తోందని ఆరోపించారు. సమత జడ్జిమెంట్ ప్రకారం ఆదివాసీలకు ప్రథమ అవకాశం కలించాలని, అర్హత లేనివారిక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. ఇప్పటికైన ఏరియా యాజమాన్యం ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో తొలి ప్రాధాన్యతనివ్వాలని జీఎం కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆలెం కోటి, జ్యోతిబసు, సోడే రవి కుమార్, పూనెం నాగరాజు, గనిబోయిన ముత్తయ్య, సోడే సమ్మయ్య, కళ్యాణ్ పాల్గొన్నారు.

'గృహా జ్యోతి'ని సద్వినియెగం చేసుకోండి: ఏడీఈ

మణుగూరు రూరల్, ఫిబ్రవరి 10: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహా జ్యోతి పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ఏడీఈ జీవన్ కుమార్ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. గృహా జ్యోతి పథకంపై మా సిబ్బంది చేత డివిజన్‌లో వినియోగదారులకు అవగాహన కల్పించామన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ప్రజా పాలన రసీదు, కరెంట్ బిల్లును తమ సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ వేణుగోపాల్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న జీఎం షాలెం రాజు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 10: సింగరేణిలో నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును రవాణ చేసి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కొత్తగూడెం సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు పేర్కొన్నారు. కొత్తగూడెం సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశానుసారం ఆయన మాట్లాడారు. బొగ్గు వినియోగత పెరిగినందున నాణ్యతతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేసి నాణ్యమైన బొగ్గును రవాణా చేయాలని కోరారు. మన సంస్థ, మన గని మన బాధ్యతలను వివరించే ఇటువంటి సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా మన సంస్థ స్థితిగతులను తెలుసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జీఎం ఆఫీస్‌లో పని చేసి ప్రతి ఉద్యోగికి సంస్థ ఉత్పత్తిలో భాగస్తులవుతున్నారని అన్నారు. ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా పనిచేసి ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలని ఆయన కోరారు. కార్మికుల సంక్షేమానికి సంస్థ అనేక కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. వారి సంక్షేమమే సంస్థ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జీఎం ఎస్ఓతో పాటు ఎస్ఓ టు జీఎం జీవీ కోటిరెడ్డి, ఎజీఎం (ఫైనాన్స్) కే హానా సుమలత, డిజీఎం (ఐఈడీ) ఎన్ యోహాన్, పర్సనల్ మేనేజర్ శివ కేశవరావు, ఆర్‌సిహెచ్ ఇన్‌చార్జ్ ఎస్‌కే కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహిత అంశాలకు కేటాయింపులు హర్షణీయం

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే రాష్ట్ర బడ్జెట్లో కేటాయింపులు జరిగాయని, ప్రజాహిత అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం హర్షణీయం అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. విద్య, వైద్యం, గృహవసతి, విద్యుత్ వంటి ప్రధాన అంశాలకు పెద్ద మొత్తంలో కేటాయింపులు జరిపారన్నారు. ప్రజాపాలన అందిస్తారనే నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టంకట్టారని, ఆ నమ్మకానికి అనుగుణంగా కేటాయింపులు జరిపినప్పటికీ నిధుల విడుదలలో ఎలాంటి తప్పిదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ బడ్జెట్ జనరంజకం: కొత్వాల

పాల్వంచ టౌన్: తెలంగాణ బడ్జెట్ జనరంజకం అని డీసీఎంఎస్ ఛైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2,73,891 కోట్లలో ఆరు గ్యారంటీల అమలు కోసం అత్యధికంగా 53,196 కోట్లు కేటాయించడం ఎన్నికల వాగ్దానాల అమలులో ప్రభుత్వ చిత్తశుద్ధి తెలియజేస్తోందన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతం చేయాలి

గుండాల, ఫిబ్రవరి 10: మహాలక్ష్మీ, ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలని కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.శిరీష అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ, తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ నమోదు కేంద్రాలను సందర్శించారు. నమోదు జరుగుతున్న తీరును పరివేక్షించి సంతృప్తి వ్యక్త చేశారు. మహాలక్ష్మి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు.

రహదారిపై ఇసుక లారీలు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 10: మణుగూరు నుంచి మేడారం వెళ్లే ప్రధాన రహదారిపై గోదావరి ఇసుక కోసం వచ్చిన లారీలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. గంటల కొద్దీ ఇసుక కోసం వేచి ఉంటున్న లారీలు, ఇసుక లోడులతో భారీ సంఖ్యలో వెళ్తోన్న ఇసుక లారీల ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు కొరకరాని కొయ్యలా తయారైంది. దీంతో మేడారం రద్దీని తట్టుకోలేమని భావించి ముందస్తుగానే వనదేవతలకు తమ మొక్కులు చెల్లించుకునేందు వెళ్లి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటూ ఇసుక లారీలు.. ఇటు భక్తుల వాహనాలతోపాటు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే ఈ రహదారిపై ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతోంది.

సింగరేణి ఉచిత వైద్య శిబిరం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని గొల్లకొత్తూరు గ్రామంలో సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్ మాట్లాడారు.

ఎంపీటీసీ కృష్ణకుమారికి ఘనంగా వీడ్కోలు

మణుగూరు, ఫిబ్రవరి 10: మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కుంజా కృష్ణకుమారి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా శనివారం నిర్వహించిన సంతాప సభ, అంతిమయాత్రలో రాజకీపక్షాల జిల్లా, రాష్ట్ర, మండల స్థాయి నాయకులు. ప్రజా సంఘాల నేతలు పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. నాయకులు కృష్ణకుమారికి కన్నీటి వీడ్కోలు పలికారు.

నేడు ఆర్టీసీ స్లీపర్ బస్సుల ప్రారంభం

మణుగూరు, ఫిబ్రవరి 10: మణుగూరు ఆర్‌టీసీ డిపోకు ఇటీవల కేటాయించిన రెండు స్లీపర్ బస్సులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. పట్టణంలోని సురక్ష బస్టాండ్‌లో వీటిని ప్రారంభిస్తారు. రెండు స్లీపర్‌లను కేటాయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మూగ జీవాలను తరలిస్తున్న వాహనం పట్టివేత

కరకగూడెం, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శనివారం అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని కరకగూడెం ఎస్ఐ రాజారాం పట్టుకున్నారు. అనంతరం అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఎస్ఐ పాల్వంచలోని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. కరకగూడెం మండలం నుంచి కొందరు దొంగలు మూగ జీవాలను అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.